


# కరపత్రం

SINCE 2014

శనివారం ఆగస్ట్ 29, 2026 | సంపుటి : 2 | సంచిక : 318 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4

## జల వివాదాలపై గట్టిగా వాదించాలి

- రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా వాదించాలి
- మహారాష్ట్ర, ఏపీతో జల వివాదాలపై సమీక్ష
- తుమ్మిడిహట్టి భేటీ, సీడబ్ల్యూసీ సమావేశంపై చర్చ
- సుప్రీంకోర్టు, జల బోర్డుల్లోని కేసులపై ఆరా
- ఇతర రాష్ట్రాల వాదనలకు దీటుగా తెలంగాణ వైఖరి
- ప్రజ్ఞానందకు సీఎం రేవంత్ అభినందనలు
- యువతకు ప్రజ్ఞానంద విజయం స్ఫూర్తిదాయకమని వ్యాఖ్య



హైదరాబాద్:
అంతర్రాష్ట్ర జల వివాదాలకు సంబంధించి వివిధ వేదికలపై రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేలా గట్టిగా వాదించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో నీటిపారుదల శాఖపై మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. సెప్టెంబరు 1న తుమ్మిడిహట్టిపై దిల్లీలో జరగనున్న అధికారుల భేటీ, సెప్టెంబరు 7న సీడబ్ల్యూసీ హైలెవెల్ కమిటీ సమావేశ ఎజెండాపై ఈ సమీక్షలో చర్చించినట్లు సమాచారం. మహారాష్ట్ర, ఏపీతో వివాదాలపై అధికారులు, న్యాయవాదులు తెలంగాణ వైఖరిని స్పష్టం చేయాలని సీఎం సూచించినట్లు తెలుస్తోంది. సుప్రీంకోర్టు, కేంద్ర జలవనరుల సంఘం, కృష్ణా, గోదావరి నదీ జలాల నిర్వహణ బోర్డుల్లో ఉన్న వివిధ కేసులపై చర్చించారు. కేసులు ఏ దశలో ఉన్నాయి.. ఇతర రాష్ట్రాల వాదనలేంటి.. తెలంగాణ ప్రయోజనాలు వంటి అంశాలపై సీఎం ఆరాతీసినట్లు సమాచారం.

**ప్రజ్ఞానందకు అభినందనలు తెలిపిన సీఎం**

అమెరికాలోని సెయింట్ లూయిస్‌లో జరిగిన గ్రాండ్ చెస్ టూర్ టైటిల్‌ను సొంతం చేసుకుని.. చరిత్ర సృష్టించిన భారత చెస్ గ్రాండ్ మాస్టర్ ఆర్. ప్రజ్ఞానందకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. అంతర్జాతీయ వేదికలపై భారత ఖ్యాతిని మరోసారి ప్రపంచానికి చాటిచెప్పిన ప్రజ్ఞానంద విజయం ప్రతి పౌరుడు గర్వించదగ్గ విషయమని సీఎం పేర్కొన్నారు. ప్రజ్ఞానంద విజయం క్రీడాకారులకు, యువతీ యువకులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు. భవిష్యత్తులో ప్రజ్ఞానంద మరెన్నో అద్భుతమైన విజయాలు సాధించి, దేశానికి కీర్తి తీసుకురావాలని సీఎం ఆకాంక్షించారు

## ఉజ్బెకిస్థాన్, కిర్గిస్థాన్‌లకు మోదీ

- 29 నుంచి నాలుగు రోజుల విదేశీ పర్యటన
- ఉజ్బెకిస్థాన్‌లో మిర్జియోయెవ్‌తో చర్చలు
- వాణిజ్యం, రక్షణ, ఇంధనంపై కీలక భేటీలు
- కిర్గిస్థాన్‌లో ఎస్‌సీవో సదస్సుకు హాజరు
- పుతిన్‌తో మోదీ ప్రత్యేక భేటీ
- షీ జిన్‌పింగ్, షెహబాజ్ షరీఫ్‌తోనూ సమావేశం అవకాశం
- ఎస్‌సీవో ప్లీనరీలో ప్రసంగించనున్న ప్రధాని



దిల్లీ:
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక ద్వైపాక్షిక, బహుపాక్షిక సమావేశాలకు సిద్ధమవుతున్నారు. ఈ నెల 29 నుంచి సెప్టెంబరు 1 వరకు ఉజ్బెకిస్థాన్, కిర్గిస్థాన్‌లలో మోదీ పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా కిర్గిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో జరిగే షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) సదస్సులో పాల్గొని, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో మోదీ ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ఈ భేటీలో ఇరు దేశాల మధ్య ఉన్న ద్వైపాక్షిక సంబంధాలను నేతలిద్దరూ సమగ్రంగా సమీక్షించనున్నారని విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శి సిబీ జార్జ్ తెలిపారు. కిర్గిస్థాన్ అధ్యక్షుడు సాదిర్ జాపరోవ్ ఆహ్వానం మేరకు ఎస్‌సీవో సదస్సుకు హాజరవుతున్న మోదీ చివరిరోజు ప్లీనరీలో ప్రసంగిస్తారు. ఎస్‌సీవో దేశాల ఇతర నేతలతో కలిసి ఆరో వరల్డ్ నోమాడ్ గేమ్స్ ప్రారంభ వేడుకలకు మోదీ హాజరవుతారు. ఎస్‌సీవో సదస్సుకు పుతిన్‌తోపాటు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తదితరులు హాజరయ్యే అవకాశముంది. 2017 నుంచి భారత్ పూర్తిస్థాయి సభ్య దేశంగా ఉన్న ఈ శిఖరాగ్ర సదస్సు 25వ వార్షికోత్సవాన్ని జరుపుకోనుంది.

మిగతాద్ది 2 లో

## 29న రాజ్యాంగ పరిరక్షణపై జస్టిస్ మేనకా గురుస్వామి కీలక ప్రసంగం




హైదరాబాద్:
భారత రాజ్యాంగం, పరిరక్షణపై హైదరాబాద్‌లో కీలక చర్చ జరగనుంది. ఎస్. జైపాల్ రెడ్డి మెమోరియల్ ఫౌండేషన్.. మంథన్ ఫౌండేషన్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనుంది.



## పరకాల వివాదం తర్వాత.. సీఎం నివాసానికి మంత్రి కొండా సురేఖ

హైదరాబాద్:
రక్షా బంధన్ సందర్భంగా మంత్రులు కొండా సురేఖ, సీతక్క ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసానికి వెళ్లి రాఖీ కట్టారు. పరకాల వివాదం తర్వాత కొండా సురేఖ.. సీఎం నివాసానికి వెళ్లడం ఇదే తొలిసారి. సీఎంతో భేటీ అనంతరం కొండా సురేఖ మీడియాతో మాట్లాడకుండానే అక్కడి నుంచి వెళ్లి పోయారు.

## మంత్రి పొన్నం ప్రభాకర్‌కు 'సర్' నోటీసు

- కరీంనగర్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఎస్ఐఆర్ నోటీసులు
- తండ్రి పేరు తప్పుగా నమోదవడంతో బీఎల్‌వో నోటీసు
- నోటీసులకు స్పందించిన మంత్రి పొన్నం
- తండ్రి పేరు సవరణకు పత్రాలు సమర్పణ
- ఓటర్ జాబితా సవరణ ప్రక్రియలో ఘటన




కరీంనగర్:
ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు నోటీసు వచ్చింది. మంత్రి తండ్రి పేరు తప్పుగా పడడంతో బీఎల్‌వో నోటీసులు ఇచ్చారు. నోటీసులకు స్పందించిన మంత్రి.. తండ్ర పేరు సవరణకు తగిన పత్రాలను బీఎల్‌వోకు అందజేశారు.

## ఆయిల్‌పామ్ సాగుకు ఊతం

- సాగు విస్తరణను వేగవంతం చేయాలి: తుమ్మల
- రైతుల ఆసక్తికి అనుగుణంగా మొక్కల లభ్యత పెంచాలి
- సకాలంలో మొక్కలు అందేలా చర్యలు
- వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్ల పంపిణీ వేగవంతం
- యాంత్రీకరణ రాయితీని నేరుగా రైతుల ఖాతాల్లో జమ
- ఆగస్టులో 1.17 లక్షల టన్నుల యూరియా సరఫరా
- ఫెర్టిలైజర్ యాప్‌పై రైతులకు అవగాహన కల్పించాలి

హైదరాబాద్:
రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగు విస్తరణ కార్యక్రమం మరింత వేగవంతం చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు.






## తెలంగాణలో పెరిగిన క్రైమ్.. హైదరాబాద్‌లో తగ్గిన తీవ్రమైన నేరాలు

- మూడేళ్లలో తెలంగాణలో నేరాలు 7.15% పెరుగుదల
- కేసులు 2.65 లక్షల నుంచి 2.84 లక్షలకు పెరుగుదల
- డ్రగ్స్ కేసులు 46.10% పెరిగాయి
- ఆర్గనైజ్డ్ క్రైమ్ 25 నుంచి 451 కేసులకు పెరుగుదల
- హైదరాబాద్‌లో తీవ్రమైన నేరాలు 26.23% తగ్గాయి
- రాష్ట్రంలో తీవ్ర నేరాలు 10.33% తగ్గుదల
- సైబర్ క్రైమ్ రేటు 13.29% తగ్గింది
- సైబరాబాద్‌లో డ్రగ్స్ కేసులు 90.98% పెరిగాయి
- డ్రగ్స్‌పై ప్రత్యేక నిఘా పెట్టాలి: డీజీపీ

2 లో

2 లో



## యుద్ధ ట్యాంకుల ప్రాధాన్యత ఎప్పటికీ తగ్గదు : రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

జబల్పూర్ (మధ్యప్రదేశ్):
యుద్ధ రంగంలో డ్రోన్లు, క్షిపణుల పాత్ర ఎంత పెరుగుతున్నప్పటికీ, యుద్ధ ట్యాంకుల ప్రాధాన్యత ఎప్పటికీ తగ్గదని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు.

2 లో

## 'అదృష్టమంటే ఇదేనేమో'.. లక్కీడ్రాలో ఆసక్తికర ఘటన

హైదరాబాద్‌లోని క్యూర్ పరిధిలో తెలంగాణ ప్రభుత్వం నిర్మించనున్న ఇందిరమ్మ టవర్స్‌లో ఫ్లాట్ల కేటాయింపునకు లక్కీడ్రా ప్రారంభమైంది. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని మైలార్‌దేవుపల్లి లక్ష్మీగూడలో ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. లక్కీ డ్రా టోకెన్‌ను ఓ బాలుడితో తీపించగా.. ఆ చిన్నోడి కుటుంబానికే ఇల్లు వరించడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ వీడియోను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. పేదల సొంతింటి కల తీర్చాలనే ఈ ప్రభుత్వ సంకల్పానికి, దేవుడి ఆశీస్సులు తోడైనట్టు చిన్నోడు తీసిన లక్కీ డ్రాలో వారి కుటుంబానికే (జరపుల లక్ష్మీ) టోకెన్ రావడం తమ అందరినీ ఆనందానికి, ఆశ్చర్యానికి గురిచేసిందని మంత్రి పేర్కొన్నారు. "ఇలాంటి సందర్భాలు చాలా అరుదు. చిన్న పిల్లలు దేవుళ్లతో సమానం. చిన్నారులు స్వచ్ఛమైన మనసు కలిగినవారు. ఆ దేవుడి ఆశీర్వాదం, ప్రభుత్వ సహకారంతో వారి కల నేరవేరుతున్నందున ఆ కుటుంబం సొంతింటిలో జీవితాంతం చల్లగా బతకాలని, ఆ ఆడబిడ్డను ఆశీర్వదించాను" అని పేర్కొంటూ వీడియోను షేర్ చేశారు.




## రైస్ మిల్లుల్లో విజిలెన్స్ తనిఖీలు.. రూ.కోట్ల విలువైన ధాన్యం మాయం

ముథోల్:
బాసర జిల్లా బైంసా, ముథోల్ మండలాల్లో శుక్రవారం పలు రైస్ మిల్లులో విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. దీంతో రూ.కోట్ల విలువైన ధాన్యానికి సంబంధించి అక్రమాలు వెలుగు చూశాయి. ముథోల్ మండలంలోని వర్తాల గ్రామంలోని నీలకంఠేశ్వర్ రైస్ మిల్లులో తనిఖీలు చేయగా.. 2022-23 సంవత్సరం రబీ కాలానికి సంబంధించి ప్రభుత్వం 4,224 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సీఎంఆర్ కోసం ఇవ్వగా, కేవలం 336 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే లెక్కతేలింది.






## పోక్సో నేరగాడని తెలిసీ.. బాలికల పాఠశాలలో పోస్టింగా..?

థాణె:
మహారాష్ట్రలోని థాణె జిల్లాలో గల ఓ ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో 22 మంది బాలికలపై లైంగిక వేధింపుల ఘటన తీవ్ర దుమారం రేపింది. ఈ కేసులో పాఠశాలలో వంటవాడిగా పనిచేస్తోన్న గణపత్ గవిల్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శనివారం ఆగస్ట్ 29, 2026

## ఉజ్బెకిస్థాన్, కిర్గిస్థాన్‌లకు మోదీ

మొదటిపేజీ తరువాయి

కిర్గిస్థాన్ కంటే ముందు 29, 30 తేదీల్లో ఉజ్బెకిస్థాన్‌లో ప్రధాని పర్యటిస్తారు. ఆ దేశ అధ్యక్షుడు షౌకత్ మిర్జియోయెవ్ ఆహ్వానం మేరకు తాష్కెంట్‌కు వెళతారు. ఇది ఉజ్బెకిస్థాన్‌లో మోదీకి నాలుగో పర్యటన. తాష్కెంట్‌లో మిర్జియోయెవ్‌తో మోదీ ప్రతినిధి స్థాయి చర్చలు జరపనున్నారు. భారత్ – ఉజ్బెకిస్థాన్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడమే ఈ చర్చల ప్రధాన ఉద్దేశం. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, డిజిటల్ కనెక్టివిటీ, ఇంధనం, విద్య, ప్రజల మధ్య సంబంధాలు వంటి అంశాలపై ఇరు దేశాల నేతలు చర్చించనున్నారు. తాష్కెంట్‌లో శాస్త్రి మెమోరియల్, తాష్కెంట్ స్టేట్ యూనివర్సిటీ ఆఫ్ ఓరియంటల్ స్టడీస్‌లోని మహాత్మాగాంధీ కేంద్రాన్ని మోదీ సందర్శించనున్నారు.

## పోక్సో నేరగాడని తెలిసీ.. బాలికల పాఠశాలలో పోస్టింగా..?

మొదటిపేజీ తరువాయి

కాగా.. దర్యాప్తులో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. నిందితుడు తరచూ ఇలాంటి నేరాలకు పాల్పడటమే గాక.. గతంలో ఓసారి పోక్సో చట్టం కింద జైలుకు కూడా వెళ్లినట్లు తెలిసింది. అలాంటి నేరచరిత్ర ఉన్న వ్యక్తిని స్కూల్లో నియమించుకోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

“గణపత్ గవిల్ గతంలో మరో ఆశ్రమ పాఠశాలలో పనిచేశాడు. ఆ సమయంలో అతడు పలువురు బాలికలను వేధించినట్లు ఆరోపణలు రావడంతో పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. నాడు అతడిని విధుల నుంచి సస్పెండ్ చేశారు. కొన్నాళ్ల పాటు జైల్లో ఉండి వచ్చాడు. ఇప్పుడు అతడిని మళ్లీ ఎలా విధుల్లోకి తీసుకున్నారు? ఎవరు నియమించారన్నది ఇంకా తెలియరాలేదు” అని సంబంధిత అధికారులు వెల్లడించారు.

### ప్రేమజంట బ్రేకప్‌తో పేపర్ లీకేజీ గుట్టురట్టు

థాణె జిల్లాలోని తెంబాలో గల ఆదివాసి ఆశ్రమ పాఠశాలలో తాజా ఘటన చోటుచేసుకుంది. తొలుత బాధిత విద్యార్థులు ఆగస్టు 24న దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. భోజనం కోసం వచ్చిన తమను గణపత్ అసభ్యంగా తాకుతూ కొంతకాలంగా వేధిస్తున్నాడని పేర్కొన్నారు. దీంతో స్కూల్ యాజమాన్యాన్ని సంప్రదించిన పోలీసులు.. కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు. ప్రస్తుతం దీనిపై దర్యాప్తు కొనసాగుతోంది. గణపత్ నియామకంపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

## ఆయిల్‌పామ్ సాగుకు ఊతం

మొదటిపేజీ తరువాయి

రైతుల్లో పెరుగుతున్న ఆసక్తికి అనుగుణంగా మొక్కల లభ్యత పెంచడంతోపాటు సకాలంలో మొక్కలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సచివాలయంలో వ్యవసాయ, సహకార శాఖల పరిధిలోని పలు అంశాలపై ఉన్నతాధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ పురోగతి, ఆయిల్‌పామ్ సాగు విస్తరణ, రసాయన ఎరువుల లభ్యత, యూరియా సరఫరా, ఇబ్బందులు, వ్యవసాయ యాంత్రీకరణ, రైతు వేదికలపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు తదితర అంశాలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. రైతులకు వ్యవసాయ పనులు సులభతరం చేయడంతోపాటు సాగు ఖర్చులు తగ్గించేందుకు అమలు చేస్తున్న వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద రైతులకు అందించాల్సిన పనిముట్లను ఖరారు చేసినట్లు తెలిపారు.

రైతుల అవసరాలకు అనుగుణంగా పనిముట్లను ఎంపిక చేసి పంపిణీ ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈసారి యాంత్రీకరణ పథకం కింద అందించే రాయితీ నిధులు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. యూరియా సరఫరాలో ఇబ్బందులు లేవని.. కేంద్రం ప్రవేశపెట్టిన ఫెర్టిలైజర్ యాప్ ద్వారా వచ్చే సమస్యలు పరిష్కరిస్తూ రైతులకు యూరియా సరఫరా చేస్తున్నామని మంత్రి తుమ్మల తెలిపారు. ఆగస్టు సరఫరా ప్రణాళికలో భాగంగా 1.50 లక్షల మెట్రిక్ టన్నులకు గాను 1.17 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను రాష్ట్రానికి తెప్పించగలిగామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఫెర్టిలైజర్ యాప్ వినియోగం, యాప్‌లో బుకింగ్, లభ్యత, కొనుగోలు ప్రక్రియ వంటి అంశాలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను తుమ్మల ఆదేశించారు.

## తెలంగాణలో పెరిగిన క్రైమ్.. హైదరాబాద్‌లో తగ్గిన తీవ్రమైన నేరాలు

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్‌లో తీవ్రమైన నేరాలు తగ్గినట్లు డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. తెలంగాణలో నేరాలపై పోలీసు అధికారులతో డీజీపీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వివరాలు వెల్లడించారు. తెలంగాణలో మూడేళ్లలో నేరాలు 7.15 శాతం పెరిగాయి. 2023-24లో 2,65,377 కేసులు నమోదు కాగా, 2025-26లో వీటి సంఖ్య 2,84,363కు పెరిగింది. డ్రగ్స్ కేసుల్లో 46.10% పెరుగుదల నమోదై 2,026 నుంచి 2,960 కేసులు పెరిగాయి. ఆర్గనైజ్డ్ క్రైమ్ కేసులు 25 నుంచి 451కి పెరిగాయి. ట్రాఫిక్ నేరాల్లో 9.48% పెరుగుదల నమోదైంది. మరోవైపు సైబర్ క్రైమ్ రేటు 13.29 శాతానికి తగ్గింది. ఆర్థిక నేరాలు 13.28%, తీవ్ర నేరాలు 10.33 శాతానికి తగ్గాయి. హైదరాబాద్ నగరంలో తీవ్రమైన నేరాలు 26.23% తగ్గగా, సైబరాబాద్‌లో డ్రగ్స్ కేసులు 90.98% పెరిగాయి. ఆదిలాబాద్‌లో డ్రగ్స్ కేసులు 57 నుంచి 219కి చేరాయి.

సమీక్ష సందర్భంగా అధికారులకు డీజీపీ పలు సూచనలు ఇచ్చారు. నెలవారీ క్రైమ్ రివ్యూలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. క్రైమ్ రివ్యూలు కేవలం గణాంకాలకే పరిమితం కాకూడదన్నారు. నేరాల కారణాలు, పని విధానం, దర్యాప్తు నాణ్యత, కేసుల పరిష్కారంపై విశ్లేషణ చేయాలన్నారు. ఫీల్డ్ లెవల్ పోలీసింగ్‌ను బలోపేతం చేయాలని ఆదేశించారు. తనిఖీల్లో గుర్తించిన సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. నేర ధోరణులను ముందుగానే గుర్తించి యాక్షన్ ప్లాన్‌లు రూపొందించాలని పేర్కొన్నారు. క్రైమ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ (సీసీటీఎన్ఎస్) డేటా అప్‌డేట్ 96%కి చేరిందన్నారు. గతంలో ఈ ఇది 70-80 శాతం ఉన్నట్లు పేర్కొన్నారు. ఏఐ, సీసీటీఎన్ఎస్, టీజీ కాప్, హాక్ఐ టెక్నాలజీ, ఈగల్, ఐసీజేఎస్, కొత్త క్రిమినల్ చట్టాల అమలుపైనా డీజీపీ సమీక్ష నిర్వహించారు. యూనిట్ స్థాయి జవాబుదారీతనం, సత్వర నిర్ణయాలు, ఫోకస్డ్ ఫీల్డ్ యాక్షన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశించారు. డ్రగ్స్‌పై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు.

## యుద్ధ ట్యాంకుల ప్రాధాన్యత ఎప్పటికీ తగ్గదు : రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

మొదటిపేజీ తరువాయి

సరిహద్దుల్లో శత్రువుకు ఇవి “ఉక్కు గోడ”లా నిలిచి, సైనికుల ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని కొనియాడారు. గురువారం మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో ఉన్న 57 ఏండ్ల చరిత్ర కలిగిన వెహికల్ ఫ్యాక్టరీ జబల్‌పూర్ (వీఎఫ్ జే)లో రూ.472 కోట్ల వ్యయంతో నిర్మించనున్న టీ-సిరీస్ యుద్ధ ట్యాంకుల ఓవర్‌హాల్ కేంద్రానికి ఆయన శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రాజ్?నాథ్?సింగ్ మాట్లాడారు. మన సైన్యం ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన బలగాల్లో ఒకటిగా ఉందని, టీ-72, టీ-90 యుద్ధ ట్యాంకులు గ్రౌండ్ వార్‌ఫేర్‌కు అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఈ నూతన కేంద్రం ద్వారా ఏటా 80 టీ-72, టీ-90 ట్యాంకులను ఓవర్‌హాల్ చేయనున్నట్లు తెలిపారు. భారత సైన్యానికి ఏటా సుమారు 230 ట్యాంకుల పునరుద్ధరణ చేయాల్సిన అవసరం ఉందన్నారు.

## 29న రాజ్యాంగ పరిరక్షణపై జస్టిస్ మేనకా గురుస్వామి కీలక ప్రసంగం

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది, రాజ్యసభ సభ్యురాలు డాక్టర్ మేనకా గురుస్వామి ‘ఇండియన్ కాన్స్టిట్యూషన్ అండ్ ఇట్స్ ప్రొటెక్షన్’ (Indian Constitution and its Protection) అనే అంశంపై ప్రసంగించనున్నారు.

ఈ కార్యక్రమం ఆగస్టు 29, శనివారం సాయంత్రం హైదరాబాద్‌లోని ఖైరతాబాద్‌లో ఉన్న ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ విశ్వేశ్వరయ్య భవన్ మెయిన్ ఆడిటోరియంలో జరగనుంది. సాయంత్రం 5.30 గంటలకు హై-టీ ఏర్పాటు చేశారు. అనంతరం 6 గంటలకు మేనకా గురుస్వామి ప్రసంగం ప్రారంభమవుతుంది. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, చట్టపరమైన అంశాలపై ఆసక్తి ఉన్నవారు ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చని నిర్వాహకులు తెలిపారు. ప్రస్తుతం దేశంలో రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్యం, ప్రాథమిక హక్కులు, చట్టబద్ధ పాలన వంటి అంశాలపై విస్తృతంగా చర్చ జరుగుతున్న నేపథ్యంలో ఈ ప్రసంగానికి ప్రాధాన్యత ఏర్పడింది. అలాగే, రాజ్యాంగం, ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు.. రాజ్యాంగాన్ని పరిరక్షించడంలో న్యాయవ్యవస్థ, ప్రజాస్వామ్య సంస్థలు, పౌరుల పాత్ర ఏమిటనే అంశాలపై మేనకా గురుస్వామి తన అభిప్రాయాలను పంచుకోనున్నారు. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదిగా మేనకా గురుస్వామి రాజ్యాంగం, పౌర హక్కులకు సంబంధించిన పలు కీలక కేసుల్లో వాదించారు. ముఖ్యంగా భారతీయ శిక్షాస్మృతిలోని (IPC) సెక్షన్ 377ను సవాలు చేసిన న్యాయపోరాటంలో ఆమె కీలక పాత్ర పోషించారు. ఈ నేపథ్యంలో రాజ్యాంగాన్ని ఎలా పరిరక్షించాలి? ప్రజాస్వామ్య విలువలను కాపాడటంలో పౌరుల బాధ్యత ఏమిటి? వంటి అంశాలపై ఆమె చేసే ప్రసంగం ఆసక్తిని రేకెత్తించే అవకాశం ఉంది. ఈ కార్యక్రమానికి నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా, హైదరాబాద్ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ శ్రీకృష్ణ దేవరావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

# పరకాల వివాదం తర్వాత.. సీఎం నివాసానికి మంత్రి కొండా సురేఖ

మొదటిపేజీ తరువాయి

సీఎం రేవంత్‌రెడ్డికి బంగారు రాఖీ కట్టిన తర్వాత.. ఆమె నివాసంలో కొండా సురేఖ మీడియాతో మాట్లాడారు. “సీఎం రేవంత్‌రెడ్డికి మూడోసారి రాఖీ కట్టా. నేను అందరికీ సోదరినే. పండుగ వాతావరణంలో ఎలాంటి రాజకీయ వ్యాఖ్యలు చేయను. ముఖ్యమంత్రికి మహిళల అండ ఎప్పుడూ ఉంటుంది. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే శక్తి ఆయనకు ఇవ్వాలని దేవుడిని కోరుకున్నా. ఆడబిడ్డల ఆశీర్వాదాలు సీఎంకు ఎప్పుడూ ఉండాలని కోరుకున్నా” అని తెలిపారు.

### ఏం జరిగిందంటే?

ఇటీవల.. ములుగు, పరకాలలో జరిగిన కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. అయితే ఈ కార్యక్రమాల్లో వరంగల్ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తోన్న కొండా సురేఖ పాల్గొనలేదు. ముఖ్యమంత్రి పర్యటనలో స్థానిక మంత్రి పాల్గొనకపోవడం చర్చనీయాంశమైంది. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని మంత్రి కొండా సురేఖ తీవ్ర స్థాయిలో వ్యతిరేకిస్తున్నారు. తమ వర్గీయులను అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపణలు చేశారు. మరోవైపు పరకాల బహిరంగ సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి వచ్చే ఎన్నికల్లో రేవూరి ప్రకాశ్‌రెడ్డిని భారీ ఆధిక్యతతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వచ్చే ఎన్నికల్లో రేవూరే అభ్యర్థి అన్న సంకేతం ఇచ్చినట్లయ్యింది. ఇది జరిగిన మరుసటి రోజే కొండా సురేఖ కుమార్తె పరకాల నియోజకవర్గంలోని గీసుకొండలో సభ ఏర్పాటు చేసి ముఖ్యమంత్రిపైన, స్థానిక ఎమ్మెల్యేపైన తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేయడంతో పాటు వచ్చే ఎన్నికల్లో ఇక్కడి నుంచి పోటీచేస్తానని చెప్పారు. సుస్మిత చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ అధిష్ఠానం కూడా సీరియస్‌గా తీసుకొన్నట్లు సమాచారం. నేరుగా ముఖ్యమంత్రిపై చేసిన విమర్శలు, ఆరోపణలు కాంగ్రెస్‌లో తీవ్ర స్థాయిలో చర్చనీయాంశంగా మారాయి. ఈ వ్యవహారంలో పీసీసీ క్రమశిక్షణా కమిటీ మంత్రి కొండా సురేఖకు నోటీసు ఇవ్వగా, కుమార్తె చేసిన ఆరోపణలకు తానెలా బాధ్యురాలిని అవుతానని సమాధానం ఇచ్చారు. క్రమశిక్షణా రాహిత్యంగా భావించి నోటీసులివ్వడంతోనే పరిమితం కాకుండా చర్యలకు కూడా ఉపక్రమించే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో సీఎం నివాసానికి కొండా సురేఖ వెళ్లడం చర్చనీయాంశంగా మారింది..

## రైస్ మిల్లుల్లో విజిలెన్స్ తనిఖీలు.. రూ.కోట్ల విలువైన ధాన్యం మాయం

మొదటిపేజీ తరువాయి

మిగతా 3,888 మెట్రిక్ టన్నుల ధాన్యం మాయమైంది. లెక్కతేలని ధాన్యం విలువ సుమారు రూ.8.70 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు.

భైంసా మండలంలోని మాటేగా గ్రామంలో ఉన్న నీలకంఠ రైస్ మిల్లులో తనిఖీలు చేయగా అక్కడ 977 మెట్రిక్ టన్నుల ధాన్యం తేడా వచ్చింది. దీని విలువ సుమారు రూ.2.19 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు. భైంసా మండలంలోని దేగామ గ్రామంలో ఉన్న ఆదిత్య నారాయణ రైస్ మిల్‌కు పౌరసరఫరాల శాఖ 1,991 టన్నుల ధాన్యం ఇవ్వగా.. మిల్లులో ఒక్క బస్తా కూడా లేదు. మాయమైన ధాన్యం విలువ రూ.4.86 కోట్లు ఉంటుందని అధికారులు అంచనాకు వచ్చారు. ఈ విజిలెన్స్ దాడిలో కరీంనగర్ విజిలెన్స్ డీఎస్పీ సీతారెడ్డి, తహసీల్దార్ దినేష్ చంద్ర, సీఐలు అనిల్ కుమార్, ప్రశాంత్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ‘అదృష్టమంటే ఇదేనేమో’.. లక్కీడ్రాలో ఆసక్తికర ఘటన

మొదటిపేజీ తరువాయి

మరోవైపు, నేటి నుంచి ఈ నెల 31వ తేదీ వరకు 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సుమారు 8 వేల ఫ్లాట్లకు లక్కీడ్రా నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. రోజుకు నాలుగు నియోజకవర్గాల చొప్పున ఈ ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో 480 ఫ్లాట్లకు 600 మంది లబ్ధిదారులను లక్కీడ్రా ద్వారా ఎంపిక చేస్తామని, అనంతరం అధికారులు క్షేత్రస్థాయిలో తుది పరిశీలన చేస్తారన్నారు. వీరిలో ఎవరైనా అనర్హులుగా తేలితే మిగిలిన 120 మందిలోని అర్హులకు అవకాశం కల్పిస్తామని చెప్పారు. క్యూర్ పరిధిలో తొలి విడతగా లక్ష ఇళ్ల నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకుని ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి పొంగులేటి తెలిపారు. మరో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్థలాల గుర్తింపు ప్రక్రియ పూర్తయిందని, ఆయా నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం సెప్టెంబర్ 3వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని వెల్లడించారు.

## మాజీ మంత్రి అంబటి రాంబాబుకు అస్వస్థత.. అపోలో ఆస్పత్రికి తరలింపు




హైదరాబాద్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు అస్వస్థతకు గురయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు ఆయనను హైదర్‌గూడలోని అపోలో ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పలు పరీక్షలు నిర్వహించగా గుండెకు సంబంధించిన సమస్య ఉన్నట్లు గుర్తించారు. దీంతో వైద్యులు రెండు స్టెంట్లు వేశారు. ప్రస్తుతం ఆయన ఐసీయూలో వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు.

ఆరోగ్యం నిలకడగా ఉందని, అబ్జర్వేషన్ అనంతరం సాధారణ గదికి తరలిస్తామని వైద్యులు తెలిపారు. వైద్యులు ఆయన ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. అంబటి అనారోగ్యానికి గురయ్యాడని తెలియడంతో వైసీపీ శ్రేణులు, ఆయన అభిమానులు ఆందోళనకు గురవుతున్నారు. పలువురు నేతలు ఆసుపత్రికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీస్తున్నారు.

## నార్సింగిలో హిట్ అండ్ రన్ కేసు... అతివేగంతో బైకును ఢీకొన్న గుర్తు తెలియని వాహనం...

హైదరాబాద్ లో మరో హిట్ అండ్ రన్ కేసు నమోదయ్యింది. గుర్తు తెలియని వాహనం మితిమీరిన వేగంతో వచ్చి ఢీకొనడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందారు. శుక్రవారం ( ఆగస్టు 28 ) జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి... గోల్కొండకు చెందిన మహమ్మద్ అబ్దుల్ సమద్ అనే యువకుడు నార్సింగి నుండి గండిపేటవైపు డెలివరీ తీసుకొని వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మితిమీరిన వేగంతో వచ్చిన వాహనం అబ్దుల్ ప్రయాణిస్తున్న బైకును ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయిందని చెబుతున్నారు స్థానికులు. వాహనం కొట్టిన వెంటనే అదుపుతప్పి ఫుట్పాత్ పై పడి ప్రాణాలు విడిచాడు అబ్దుల్. అబ్దుల్ ఫస్ట్ క్లబ్ లో డెలివరీ బాయ్ గా పని చేస్తున్నట్లు తెలుస్తోంది.

## భారత్‌కు రానున్న ‘జావెలిన్’.. భుజంపై నుంచే శత్రువుకు గురి..!



భారత అమ్ముల పొదిలో మరో అస్త్రం చేరనుంది. అధునాతన జావెలిన్ క్షిపణులను కొనుగోలు చేసేందుకు అమెరికాతో భారత్‌కు ఒప్పందం కుదిరింది. ఈ విషయాన్ని మన దేశంలోని అమెరికా రాయబారి సెర్గియో గోర్ శుక్రవారం వెల్లడించారు. ఇరు దేశాల మధ్య సమర్థవంతమైన ద్వైపాక్షిక రక్షణ భాగస్వామ్యాన్ని ఈ ఒప్పందం ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు.

యూఎస్ ఫారిన్ మిలిటరీ సేల్స్ ప్రక్రియలో భాగంగా ఈ క్షిపణుల కొనుగోలుకు సంబంధించిన అంగీకార పత్రాలపై భారత సైన్యం తాజాగా సంతకం చేసింది. అయితే, ఒప్పందం లో భాగంగా ఎన్ని క్షిపణులను మన దేశం కొనుగోలు చేస్తోంది..? మొత్తం ఖర్చెంత..? అన్న వివరాలు ఇంకా తెలియరాలేదు.

జావెలిన్.. ట్యాంక్ విధ్వంసకర క్షిపణి (ఏటీజీఎం-యాంటీ ట్యాంక్ గైడెడ్ మిసైల్). దీనిని భుజంపై నుంచి శత్రు ట్యాంకుల పైకి గురిపెట్టి ప్రయోగించవచ్చు. దీనిలో 3.7 అడుగుల క్షిపణి, డిస్పోజబుల్ లాంఛ్ ట్యూబ్, కమాండ్ కంట్రోల్ యూనిట్ ఉంటాయి. వాస్తవానికి ట్యాంక్‌పైకి విధ్వంసకర ఆయుధాలను ప్రయోగించినప్పుడు.. ఆ ప్రదేశం నుంచి పొగ, వేడి వెలువడతాయి. ప్రత్యర్థులు హీట్ సెన్సర్లతో వాటిని గుర్తిస్తారు. కానీ, జావెలిన్‌లో తొలుత ట్యూబ్ నుంచి ఓ మోటర్ క్షిపణిని బయటకు కొంతదూరం విసురుతుంది. ఆ తర్వాత క్షిపణి మోటార్ పనిచేయడం మొదలుపెట్టి లక్ష్యం వైపు దూసుకెళుతుంది. దీనిని కంప్యూటర్‌తో నియంత్రిస్తారు. దీంతో కచ్చితంగా జావెలిన్‌ను ఎక్కడినుంచి ప్రయోగించారో శత్రువుకు అర్థం కాదు. ఈ లోపు ప్రయోగించిన వారు సురక్షిత ప్రదేశంలో దాక్కోవచ్చు.

రియాక్టివ్ ఆర్మర్ రక్షణ కవచాలను ఛేదించి.. ట్యాంకును ధ్వంసం చేసేలా దీనిలో రెండు దశల్లో పేలుడు పదార్థాలను అమర్చారు. తొలిదశలో కవచాన్ని ఛేదించి.. ఆ తర్వాత దశలో వార్‌హెడ్ ట్యాంక్‌ను ధ్వంసం చేస్తుంది. వీటిని అమెరికాకు చెందిన రక్షణరంగ దిగ్గజాలు రేథియాన్, లాక్‌హీడ్ మార్టిన్ సంస్థలు అభివృద్ధి చేశాయి. వీటి ఉత్పత్తి చాలా క్లిష్టమైన, ఖరీదైన వ్యవహారం. వీటి ధర దాదాపు 2 లక్షల డాలర్ల వరకూ ఉంటుందని అంచనా.

### ఉక్రెయిన్‌కు దేవదూత..

రష్యాతో పోరులో ఉక్రెయిన్ ఈ క్షిపణులను విపరీతంగా వినియోగించింది. మాస్కోకు చెందిన పలు యుద్ధ ట్యాంకులను పేల్చేసింది. వీటి నుంచి తప్పించుకోవడం రష్యాకే సవాల్‌గా మారిందంటే.. వీటి సామర్థ్యాన్ని అర్థం చేసుకోవచ్చు. అప్పట్లో ఈ క్షిపణులను ఉక్రెయిన్ వాసులు ‘దేవదూత’తో పోల్చారు.

## కర్ణాటక మంత్రి నాగేంద్ర రెండోసారి రాజీనామా

కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. వాల్మీకి కుంభకోణ ఆరోపణలపై ఆ పార్టీ నేత బి.నాగేంద్ర తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. గతంలోనూ ఇవే ఆరోపణలపై ఆయన పదవి నుంచి తప్పుకొన్నారు. డీకే శివకుమార్ సీఎంగా బాధ్యతల చేపట్టిన తర్వాత మంత్రివర్గంలో చేరిన నాగేంద్ర.. విపక్షాల అవినీతి ఆరోపణల వేళ మరోసారి మంత్రి పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. తన రాజీనామా నిర్ణయాన్ని ప్రకటిస్తూ మీడియా ముందు ఒకింత భావోద్వేగానికి గురయ్యారు.ఇదీ నేపథ్యం: మహర్షి వాల్మీకి షెడ్యూల్డ్ తెగల అభివృద్ధి కార్పొరేషన్‌లో అకౌంట్స్ సూపరింటెండెంట్‌గా పనిచేసిన పి.చంద్రశేఖరన్ 2024 మే నెలలో ఆత్మహత్య చేసుకున్నారు. కార్పొరేషన్ నిధుల దుర్వినియోగం జరిగిందని ఆరోపిస్తూ ఓ లేఖ రాశారు. కార్పొరేషన్ ఖాతా నుంచి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతాకు రూ.89.63 కోట్లు, అక్కడి నుంచి మరికొన్ని ఖాతాలకు ఆ నిధులు బదిలీ అయినట్లు విచారణలో తేలింది. దీంతో అప్పట్లో రాజకీయంగా దుమారం రేగింది. ఈ వివాదం సమయంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న నాగేంద్ర 2024 జూన్‌లో పదవికి రాజీనామా చేశారు.ప్రచురణ వివాదంలో సోనియా ఆత్మకథ.. స్పందించిన పెంగ్విన్ ఇండియా అయితే, తనపై వచ్చిన ఆరోపణలన్నీ రాజకీయ ప్రేరేపితమైనవని నాగేంద్ర పేర్కొన్నారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శనివారం ఆగస్ట్ 29, 2026

# 100 రూపాయలకు మూడు పైసలు చెల్లిస్తే చాలు

## అప్పుచేసి పప్పుకూడు తినరా ఓ నరుడా!

# నేటి నీతి వాక్యమిదే వినరా పామరుడా!

**శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్**

జీ గ్రూప్ మరియు ఎస్సెల్ గ్రూప్ వ్యవస్థాపకుడు (Founder) సుభాష్ చంద్రకు సంబంధించినది. నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (NCLT) ఆయన వ్యక్తిగత దివాలా తీసే ప్రక్రియ (Personal Insolvency) లో ఒక కీలకమైన పరిష్కార ప్రణాళికను (Repayment Plan) ఆమోదించింది.

దీని ద్వారా వివిధ బ్యాంకులు మరియు ఆర్థిక సంస్థలు క్లెయిమ్ చేసిన దాదాపు రూ. 22,006 కోట్ల బాకీలను కేవలం రూ. 6.25 కోట్ల చెల్లింపుతో సెటిల్మెంట్ చేయడానికి అనుమతి లభించింది....

అంటే మొత్తం అప్పులో 0.027% చెల్లిస్తే చాలు అని నేషనల్ కంపెనీ లార్డ్ ట్రిబ్యునల్ దయతలిచింది.

ఈ రుణమాఫీ ప్రక్రియ ఒక సంచలనమైంది.

ఈ మొత్తం ప్రక్రియను ఇప్పుడు భారతదేశపు తో పాటు ప్రపంచమే ఆశ్చర్యంతో చూస్తున్నది.

**రూ. 22,000 కోట్ల బాకీ**

- **కేవలం రూ. 6.25 కోట్లకు ఎలా మారింది?**

**వ్యక్తిగత గ్యారెంటీ మాయ ఇది**

Personal Guarantor

ఈ రూ. 22,000 కోట్లు సుభాష్ చంద్ర సొంతంగా తీసుకున్న అప్పు కాదు. ఆయనకు చెందిన ఎస్సెల్ గ్రూప్ సంస్థలు వివిధ బ్యాంకుల నుండి తీసుకున్న రుణాలకు ఆయన వ్యక్తిగత పూచీకత్తు ఇచ్చారు.

- **కంపెనీలు డిఫాల్ట్ కావడంతో ఆ బాధ్యత ఆయనపై పడింది.**

**99.97% లోన్ క్షవరం**

Haircut ..ఈ సెటిల్‌మెంట్ వల్ల బ్యాంకులకు దాదాపు 99.97% నష్టం..హెయిర్‌కట్ వాటిల్లుతోంది.

**అంటే బ్యాంకులు తమకు రావాల్సిన ప్రతి 100 రూపాయలలో కేవలం 3 పైసలు మాత్రమే రికవరీ చేసుకోగలుగుతున్నాయి.**

**చీజూ ఈ ప్లాన్‌ను ఎందుకు ఆమోదించింది?**

**మెజారిటీ రుణదాతల ఆమోదం**

- **దివాలా నిబంధనల (IBC) ప్రకారం 75% పైగా రుణదాతలు ఒప్పుకుంటే ప్లాన్ ఆమోదించబడుతుంది.**
- **సుభాష్ చంద్ర సమర్పించిన ఈ ప్రతిపాదనకు 80.81% మంది రుణదాతలు .. Committee of Creditors ఓటు వేసి**




**మద్దతు తెలిపారు.**

**తక్కువ ఆస్తుల విలువ**

సుభాష్ చంద్ర వ్యక్తిగత ఆస్తుల విలువ ప్రస్తుతం రూ. 6.5 కోట్ల కంటే చాలా తక్కువగా ఉందని ట్రిబ్యునల్ గుర్తించింది.

**ఒకవేళ ఈ ప్లాన్ తిరస్కరించి ఆయన్ను పూర్తిగా దివాలా తీసినట్లు ప్రకటిస్తే, బ్యాంకులకు ఈ రూ. 6.25 కోట్లు కూడా దక్కవని, ఇంకా తక్కువ మొత్తం వస్తుందని ట్రిబ్యునల్ భావించింది.**

**ట్రిబ్యునల్ స్పష్టత**

మెజారిటీ బ్యాంకుల 'వాణిజ్య నిర్ణయం' Commercial Wisdom లో తాము జోక్యం చేసుకోలేమని చీజూ స్పష్టం చేసింది.

**బ్యాంకుల పరిస్థితి?**

- **తదుపరి చర్యలు ఏమిటి**

ఈ ప్రతిపాదనను వ్యతిరేకించిన బ్యాంకులు.. ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ .. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ .. యాక్సిస్ బ్యాంక్ మరియు కెనరా బ్యాంక్ వంటి కొన్ని సంస్థలు ఈ తక్కువ మొత్తానికి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ దీనికి వ్యతిరేకంగా ఓటు వేశాయి.

**అప్పీల్‌కు సిద్ధం**

ఈ తీర్పుపై హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మరియు ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ సంస్థలు పై కోర్టు అయిన NCLAT... నేషనల్ కంపెనీ లా అప్పీలేట్ ట్రిబ్యునల్ లో సవాలు చేయడానికి సిద్ధమవుతున్నాయి.

**అసలు కంపెనీల బాధ్యత**

ఈ సెటిల్‌మెంట్ కేవలం సుభాష్ చంద్ర వ్యక్తిగత గ్యారెంటీకి మాత్రమే వర్తిస్తుంది.

- **అప్పు తీసుకున్న అసలు కంపెనీలు .. Principal Debtors మరియు వాటి వద్ద ఉన్న ఆస్తులు, తాకట్టులపై బ్యాంకులు తమ రికవరీ చర్యలను స్వతంత్రంగా కొనసాగించవచ్చు.**

**బ్యాంకులకు ఉన్న ఇతర రికవరీ మార్గాలు**

ఈ ఆర్డర్ కేవలం సుభాష్ చంద్ర వ్యక్తిగత గ్యారెంటీని మాత్రమే పరిష్కరిస్తుంది, అసలు అప్పును కాదు.

**కార్పొరేట్ అప్పులు రద్దు కాలేదు**

కేంద్ర ప్రభుత్వ వర్గాలు మరియు ఆర్థిక నిపుణుల స్పష్టత ప్రకారం, అసలు అప్పు తీసుకున్న ప్రధాన కంపెనీల (Principal Borrowers) బాధ్యత అలాగే ఉంటుంది.

**ఆస్తుల జప్తు కొనసాగుతుంది**

బ్యాంకులు ఆయా కంపెనీలకు చెందిన కార్పొరేట్ ఆస్తులు, తాకట్టు పెట్టిన ఈక్విటీ షేర్లు మరియు ఇతర కొలేటరల్స్ పై తమ రికవరీ చర్యలను మరియు చట్టపరమైన కేసులను స్వతంత్రంగా కొనసాగించవచ్చు.

## జువెనైల్ హోమ్‌లో లయోలా అకాడమీ విద్యార్థులు

# మాస్ కమ్యూనికేషన్ లో స్ఫూర్తిదాయక కార్యక్రమం

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**

**స్కిట్లు, దేశభక్తి గీతాలు, ప్రేరణాత్మక ప్రసంగాలతో బాలల్లో సానుకూల ఆలోచనలకు ప్రోత్సాహం**

సామాజిక బాధ్యత, మానవీయ విలువలు మరియు సానుభూతిని పెంపొందించే లక్ష్యంతో నిర్వహిస్తున్న PLANET -- ఔట్‌రీచ్ కార్యక్రమంలో భాగంగా, లయోలా అకాడమీకి చెందిన బి.ఏ. మాస్ కమ్యూనికేషన్ 2025--26 బ్యాచ్ విద్యార్థులు హైదరాబాద్ సైదాబాద్‌లోని బాలుర జువెనైల్ హోమ్‌ను సందర్శించి అక్కడి బాలలతో అర్థవంతమైన సంభాషణలు, సృజనాత్మక కార్యక్రమాలు నిర్వహించారు.

లయోలా అకాడమీ యాజమాన్యం తరపున ఫాదర్ డా. ఎన్.బి. బాబు, ఎస్.జె., కరస్పాండెంట్ ఫాదర్ రెక్స్ ఏంజెలియో, ఎస్.జె., వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ బి. పీటర్, ఎస్.జె. మార్గదర్శకత్వంలో ఈ కార్యక్రమం జరిగింది.

ఈ సందర్భంగా మాస్ కమ్యూనికేషన్ విద్యార్థులు జువెనైల్ హోమ్‌లోని బాలలతో స్నేహపూర్వకంగా మమేకమై, వారి భావాలను తెలుసుకునే ప్రయత్నం చేశారు.

విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ సృజనాత్మక కార్యక్రమాలు అక్కడ ఆహ్లాదకరమైన,



సానుకూల వాతావరణాన్ని నెలకొల్పాయి.

విద్యార్థులు ప్రదర్శించిన స్కిట్లు, దేశభక్తి గీతాలు, ప్రేరణాత్మక ప్రసంగాలు జువెనైల్ హోమ్‌లోని బాలలను విశేషంగా ఆకట్టుకున్నాయి.

ఈ కార్యక్రమాల ద్వారా ఆశ, ఆత్మవిశ్వాసం, బాధ్యత, క్రమశిక్షణ, సానుకూల ఆలోచన మరియు జీవితంలో మంచి నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం వంటి విలువైన సందేశాలను లయోలా విద్యార్థులు అందించారు.

ఈ కార్యక్రమం మాస్ కమ్యూనికేషన్ విద్యార్థులకు తమ సంభాషణా నైపుణ్యాలను వాస్తవిక సామాజిక పరిస్థితుల్లో వినియోగించే అరుదైన అవకాశాన్ని కల్పించింది.

అదే సమయంలో సమాజంలోని వివిధ వర్గాల పట్ల సానుభూతి, సామాజిక అవగాహన, సున్నితత్వం, ఆత్మవిశ్వాసం మరియు సామాజిక బాధ్యతా భావం విద్యార్థుల్లో మరింత బలపడింది.



ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు అసిస్టెంట్ ప్రొఫెసర్లు శ్రీమతి రాజేశ్వరి, శ్రీమతి ఎస్.వి.ఎన్.ఎస్. హిమబిందు, శ్రీమతి తేజశ్విని పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ శ్రీ స్టీఫెన్ ఆశీర్వాదం సమన్వయం చేసి, విద్యార్థుల భాగస్వామ్యాన్ని సులభతరం చేయడంతో పాటు కార్యక్రమం సజావుగా జరిగేలా దగ్గరుండి పర్యవేక్షించారు.

సామాజిక స్పృహతో కూడిన విద్య, కేవలం తరగతి గదులకే పరిమితం కాకుండా సమాజంతో మమేకమై నేర్చుకునే ప్రక్రియగా ఉండాలనే సందేశాన్ని ఈ కార్యక్రమం చాటిచెప్పింది.

జువెనైల్ హోమ్‌లోని బాలల్లో ఆశ, ఆత్మవిశ్వాసం మరియు సానుకూల భవిష్యత్తుపై నమ్మకాన్ని పెంపొందించడంలో లోయోలా అకాడమీ విద్యార్థుల ఈ ప్రయత్నం ప్రశంసనీయంగా నిలిచింది.

# రక్షాబంధన్ వేడుకల్లో పాల్గొన్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

- **ధర్మపురి క్యాంపు కార్యాలయంలో సోదరీమణుల నుంచి రాఖీలు స్వీకరణ..**
- **అందరికీ రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి**

**కరపత్రం ప్రతినిధి ధర్మపురి, ఆగస్టు 28**

రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ధర్మపురి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక కౌన్సిలర్లు, నియోజకవర్గంలోని సోదరీమణులు మంత్రిని కలిసి రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి వారికి శుభాకాంక్షలు తెలియజేసి ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. రక్షాబంధన్ పండుగ అన్నాచెల్లెళ్ల అనుబంధానికి, పరస్పర ప్రేమాభిమానాలకు, ఆత్మీయతకు ప్రతీకగా నిలిచే పవిత్రమైన పర్వదినమని పేర్కొన్నారు. ఈ పండుగ ప్రతి కుటుంబంలో ఆనందం, ఐక్యత, అనురాగాలను మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు.

సోదరీమణుల ప్రేమ, ఆప్యాయత, ఆశీర్వాదాలు తనకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తాయని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి మహిళ సంతోషంగా, గౌరవప్రదంగా జీవించే సమాజ నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, మహిళలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ వార్డు సభను సద్వినియోగం చేసుకోవాలి

- **ఓటర్లు తమ వివరాలను పరిశీలించుకోవాలి డిప్యూటీ తాసిల్దార్ సుభాన్,ప్రజాప్రతినిధి సయ్యద్ ఫైజుల్లా**

**కరపత్రం ప్రతినిధి వరంగల్,ఆగస్టు 27**

ప్రత్యేక సమగ్ర ఓటరు సర్వే(ఎస్ఐఆర్)లో భాగంగా నిర్వహిస్తున్న వార్డు సభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీఎల్ఓ ఇన్‌చార్జ్ డిప్యూటీ తహసీల్దార్ మహమ్మద్ సుభాన్,ఎంఐఎం ప్రజాప్రతినిధి సయ్యద్ ఫైజుల్లా సూచించారు.వరంగల్ మౌలాలి ప్రాంతంలోని ముస్లిం కమిటీ హాలులో ప్రత్యేక సమగ్ర ఓటరు సర్వేపై వార్డు సభ నిర్వహించారు.ఈ సందర్భంగా వార్డు సభలో చేపడుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ,ఓటర్లకు కల్పిస్తున్న అవగాహన,ఓటరు జాబితాలో పేర్ల పరిశీలన,అభ్యంతరాలు,సవరణలకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.ప్రజలు తమ ఓటరు వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని,ఏవైనా తప్పులు ఉంటే నిర్ణీత ఫారాల ద్వారా సవరణలు చేసుకోవాలని మహమ్మద్ సుభాన్,సయ్యద్ ఫైజుల్లా సూచించారు.ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని,అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని వారు సూచించారు.ఓటర్లకు ఎలాంటి సందేహాలు ఉన్నా వార్డు సభలో అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో 24వ డివిజన్ బీఎల్ఓ నాజియా అంజుమ్,ఆసియా,అహ్మద్,హమీద్ మహమ్మద్(సోని),సయ్యద్ కబీర్,సయ్యద్ జీషాన్,సయ్యద్ సుల్తాన్,సాదిక్, అజం,మహ్మద్ బషీర్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన ప్రజలను ఆదుకోవడంలో విఫలమయ్యాయి

- **సెప్టెంబర్ 1న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి**
- **గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి బి. శ్రీను నాయక్**

**కరపత్రం ప్రతినిధి నరసరావుపేట, ఆగస్టు 28 :**

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లు గడుస్తున్న గిరిజన ప్రజల జీవితాల్లో వెలుగులు లేవని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన ప్రజలకు ఆర్థికంగా, సామాజికంగా, అన్ని విధాల ఆదుకోవాల్సింది పోయి మొండి చేయి చూపిస్తున్నారని గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి బి. శ్రీను నాయక్ అన్నారు. శుక్రవారం పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టి జిల్లా అధికారులు సమీక్ష సమావేశాల్లో బిజీగా ఉండటం వలన టపా ద్వారా పల్నాడు జిల్లా కలెక్టర్ కృత్తిక శుక్లాకు తమ వినతిని పంపించమని కోరడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ, గిరిజన సమాఖ్య రాష్ట్ర పిలుపులో భాగంగా కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు.




కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీలో భాగంగా కార్పొరేషన్ ద్వారా రెండు లక్షల రూపాయలు మంజూరు చేస్తామని విఫలమైందని దుయ్యబట్టారు. గ్రామీణ, పట్టణల్లో నివాసం ఉంటున్న వారికి నివేశన స్థలాలు మంజూరు చేస్తామని నేటికి దాని ఊసే ఎత్తడం లేదని ఆరోపించారు. పల్నాడు ప్రజల జీవనాడి అయిన వరికిపూడి శెల ప్రాజెక్టు పనులు మొదలు పెట్టాలన్నారు. పైప్ లైన్ ద్వారా బొల్లాపల్లి మండల పరిధిలో ఉన్న గిరిజన ప్రజలకు నీరు అందించాలన్నారు. సాగు చేసుకుంటున్న అడవి భూమికి పట్టాలు మంజూరు చేసి, సాగు చేసుకునేందుకు మూడు ఎకరాల వ్యవసాయ భూమి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బొల్లాపల్లి మండల్లోని గిరిజన తండాకు సాగునీరు, తాగునీరు లేకుండానే ఇబ్బంది ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఈ సమస్యను పరిష్కారం చేయాలన్నారు. మాచర్ల నియోజకవర్గం కారంపూడి మండల పరిధిలోని గల సనిగండ్ల తండా గిరిజన ప్రజలు సాగు చేసుకుంటున్న వ్యవసాయ భూమికి పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని జిల్లా అధికారులను కోరారు. సెప్టెంబర్ 1న ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట గిరిజన సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు భూక్యా సూర్య నాయక్, కోయ శ్రీను, రాంబాబు నాయక్, తోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# శిశుగృహంలో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు.

**కరపత్రం ప్రతినిది కరీంనగర్**

కరీంనగర్ శిశుగృహంలోని చిన్నారులతో కలిసి జిల్లా సంక్షేమ అధికారి మార్త సరస్వతి శుక్రవారం రక్షాబంధన్ వేడుకలను ఘనంగా, ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా చిన్నారులకు రాఖీలు కట్టించి, వారికి స్వయంగా మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.అమ్మ ప్రేమకు దూరంగా ఉన్న శిశుగృహ పిల్లల ముఖాల్లో చిరునవ్వులు చిందించేలా సాగిన ఈ కార్యక్రమంలో చిన్నారులు అత్యంత ఉత్సాహంగా పాల్గొన్నారు. జిల్లా సంక్షేమ అధికారి రాకతో పిల్లలంతా ఎంతో ఆనందంగా, సందడి చేస్తూ పండుగను జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో మిషన్ వాత్సల్య ప్రొటెక్షన్ ఆఫీసర్ పూదరి శాంత, చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బంది సుందరగిరి సాయికిరణ్ గౌడ్, శిశుగృహ ఏఎన్ఎం మెట్టు రమాదేవి, కౌన్సిలర్ కీర్తి, శిశుగృహ ఆయాలు చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# పండుగల వేళ ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు: సీఐ వీరప్రసాద్

- **తిప్పాపూర్ బస్టాండ్‌లో భారీగా ట్రాఫిక్ జామ్**

**కరపత్రం ప్రతినిది ప్రతినిధి వేములవాడ**

రక్షాబంధన్ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి ప్రజలు కార్లు, ఇతర వాహనాల్లో వేములవాడకు భారీగా తరలిరావడంతో తిప్పాపూర్ బస్టాండ్ వద్ద ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సుమారు రెండు గంటల పాటు వాహనాల రాకపోకలకు అంతరాయం



ఏర్పడింది.

**దగ్గరుండి ట్రాఫిక్‌ను క్లియర్ చేసిన సిఐ**

సమాచారం అందుకున్న పట్టణ సీఐ బి. వీరప్రసాద్ సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని దగ్గరుండి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ పండుగల వేళ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.ట్రాఫిక్ సమస్యపై సీఐ తక్షణమే స్పందించి దగ్గరుండి క్లియర్ చేయించడంపై వాహనదారులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.

కరపత్రం తెలుగు దిన పత్రిక

శనివారం ఆగస్ట్ 29, 2026

## మసీద్-ఏ-ఫలాహ్ వక్ఫ్ బోర్డులో నమోదు

▪ డీసీసీ అధ్యక్షుడు అయూబ్‌కు మత పెద్దల సన్మానం

**కరపత్రం ప్రతినిది వరంగల్ తూర్పు,ఆగస్టు 28**





లేబర్ కాలనీలోని మసీద్–ఏ–ఫలాహ్ వక్ఫ్ బోర్డులో నమోదు కావడానికి ప్రత్యేక చొరవ చూపిన వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్‌ను మత పెద్దలు,మసీదు కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.శుక్రవారం ఆయనను పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.మసీద్–ఏ–ఫలాహ్‌ను వక్ఫ్ బోర్డులో నమోదు చేయించేందుకు అవసరమైన ప్రక్రియలో అయూబ్ ప్రత్యేక చొరవ తీసుకుని తనవంతు సహకారం అందించారని మత పెద్దలు,ముస్లిం సోదరులు పేర్కొన్నారు.మసీదు నమోదు ప్రక్రియకు సహకరించినందుకు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు.మసీదు అభివృద్ధితో పాటు ముస్లిం సమాజ సంక్షేమానికి భవిష్యత్తులోనూ సహకారం అందించాలని ఈ సందర్భంగా వారు కోరారు.కార్యక్రమంలో మత పెద్దలు,మసీదు కమిటీ సభ్యులు,ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్‌రెడ్డికి రాఖీ కట్టిన మంత్రి కొండా సురేఖ

▪ రాష్ట్ర ప్రజలకు రాఖీ పండుగ శుభాకాంక్షలు

**కరపత్రం ప్రతినిది వరంగల్/హైదరాబాద్,ఆగస్టు 28**



రాఖీ పండుగ సందర్భంగా అటవీ,పర్యావరణ,దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ,మంత్రి సీతక్క ప్రపంచవ్యాప్తంగా రాఖీ పండుగను జరుపుకుంటున్న ప్రతి ఒక్కరికీ శుభాకాంక్షలు తెలిపారు.శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో మంత్రి సురేఖ మీడియాతో మాట్లాడారు.ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రాఖీ కట్టినట్లు మంత్రి తెలిపారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వరుసగా మూడోసారి సీఎంకు రాఖీ కట్టడం జరిగిందన్నారు.గత మూడు సంవత్సరాలుగా రాఖీ పండుగ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు ఆయన మనవడికి కూడా రాఖీ కడుతున్నట్లు చెప్పారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై తెలంగాణలోని ఆడపడుచులందరి దీవెనలు,ఆశీస్సులు ఉండాలని మంత్రి ఆకాంక్షించారు.రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడంతో పాటు ప్రజలకు మెరుగైన సుపరిపాలన అందించేందుకు సీఎంకు మరింత శక్తి, యుక్తి కలగాలని కోరుకున్నారు.అదేవిధంగా ముఖ్యమంత్రి ఆశీర్వాదాలు తెలంగాణలోని ఆడపడుచులందరిపై ఉండాలని ఆకాంక్షించారు.తాను తెలంగాణ ఆడపడుచునని,రాష్ట్రంలోని ప్రతి కుటుంబం తనను కుటుంబ సభ్యురాలిగా ఆదరిస్తోందని మంత్రి సురేఖ పేర్కొన్నారు.రాఖీ పండుగ అన్నాచెల్లెళ్లు,అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలను మరింత బలోపేతం చేయాలని,సోదర సోదరీమణుల అనుబంధం కలకాలం కొనసాగాలని మంత్రి సురేఖ ఆకాంక్షించారు.

## సంతాపం - కాసర్ల మల్లయ్యకు చైర్మన్ జంగా రాఘవరెడ్డి నివాళి

▪ దశదిన కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ఆయిల్ ఫెడరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి





**కరపత్రం ప్రతినిది కాజీపేట, ఆగస్టు 28**

వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని కాజీపేట 47వ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కాసర్ల నగేష్ తండ్రి స్వర్గీయ కాసర్ల మల్లయ్య దశదిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఆయిల్ ఫెడరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వర్గీయ కాసర్ల మల్లయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. స్వర్గీయ కాసర్ల మల్లయ్య ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో 47వ డివిజన్ కంటెస్టెంట్ కార్పొరేటర్ సందెల విజయ్ కుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సత్యవరం మధుకర్, రవీందర్, ప్రసాద్, స్థానిక నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## పెదరమచర్ల సర్పంచ్ మల్లేశం మృతికి ఎంపీ చామల సంతాపం

**కరపత్రం ప్రతినిది వరంగల్/జనగామ/ఆగస్టు 28**

జనగామ మండలం పెదరమచర్ల గ్రామ సర్పంచ్ వల్లాల మల్లేశం మృతిచెందిన విషయం



తెలుసుకున్న భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం పెదరమచర్లలోని ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా మల్లేశం భార్య,పిల్లలను కలిసి ఎంపీ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.విషాద సమయంలో మల్లేశం కుటుంబానికి అండగా ఉంటానని,అన్ని విధాలా సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు.అనంతరం మల్లేశం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో అడ్వకేట్ జమాల్ షరీఫ్,వి.సత్యనారాయణరెడ్డి,డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్,కె.రాములు,కడకంచి శ్రీనివాస్,మహేందర్‌రెడ్డి,అభిగౌడ్,శ్రీధర్‌రెడ్డి,బాల్‌రెడ్డి,జి.మహేందర్,సత్యనారాయణరెడ్డి,నర్సిరెడ్డి,నర్సింగరావు,అబ్దుల్ మన్నాన్ రజీ తదితరులు పాల్గొన్నారు.

## వాడుక భాషకు జీవం పోసిన మహనీయుడికి ఘన నివాళి

▪ తెలుగు జాతి ఆత్మగౌరవానికి ప్రతీక – గిడుగు వెంకట రామమూర్తి

▪ గిడుగు ఆశయాలే తెలుగు భాషాభివృద్ధికి మార్గదర్శకం

▪ శ్రీనివాస రామానుజన్ విద్యాసంస్థల చైర్మన్, కాంగ్రెస్ జిల్లా నాయకులు, జనగామ జిల్లా కాంగ్రెస్ డీసీసీ కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ లయన్ డాక్టర్ ముచ్చ రాజిరెడ్డి

**కరపత్రం ప్రతినిది బ్యూరో, ఆగస్టు 28**




తెలుగు భాషను ప్రజల జీవనాడిగా నిలబెట్టి, గ్రాంథిక భాష సంకెళ్ల నుంచి విముక్తి కల్పించి వాడుక భాషకు సముచిత స్థానం తీసుకువచ్చిన మహనీయుడు తెలుగు భాషా ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి అని ప్రముఖ సామాజికవేత్త, విద్యావేత్త, శ్రీనివాస రామానుజన్ ఒలింపియాడ్ స్కూల్ అధినేత, కాంగ్రెస్ జిల్లా నాయకులు, జనగామ జిల్లా కాంగ్రెస్ డీసీసీ కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ లయన్ డాక్టర్ ముచ్చ రాజిరెడ్డి పేర్కొన్నారు. 'తెలుగు భాషా దినోత్సవం" – ఆగస్టు 29 సందర్భంగా గిడుగు వెంకట రామమూర్తి జయంతిని పురస్కరించుకుని ఘనంగా నివాళు లర్పించి, తెలుగు భాషాభివృద్ధికి ఆయన చేసిన విశిష్ట సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ముచ్చ రాజిరెడ్డి మాట్లాడుతూ.. తెలుగు భాషను ప్రజలకు చేరువ చేయాలనే మహోన్నత సంకల్పంతో గిడుగు వెంకట రామమూర్తి జీవితాంతం కృషి చేశారని అన్నారు. ప్రజలు మాట్లాడే భాషే సాహిత్యానికి, విద్యకు, పరిపాలనకు పునాది కావాలనే ఆయన భావజాలం 'తెలుగు భాషా" వికాసంలో ఒక చారిత్రక మలుపుగా నిలిచిందని పేర్కొన్నారు. వాడుక భాషకు ఆయన చేసిన ఉద్యమం వల్లే నేడు తెలుగు మరింత సరళంగా, సజీవంగా ప్రజల్లో విస్తరించిందని కొనియాడారు. భాష అనేది కేవలం భావ వ్యక్తీకరణ సాధనం మాత్రమే కాదని, అది ఒక జాతి చరిత్రకు, సంస్కృతికి, ఆత్మగౌరవానికి ప్రతీక అని ఆయన అన్నారు. మాతృభాష ను గౌరవించడం అంటే మన మూలాలను గౌరవించినట్లేనని, తెలుగు భాషను పరిరక్షించడం ప్రతి తెలుగువాడి బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రపంచీకరణ ప్రభావంతో విదేశీ భాషల వినియోగం పెరుగుతున్న ఈ తరుణంలో కూడా తెలుగు భాషకు తగిన ప్రాధాన్యం కల్పించాలని, మాతృభాషపై మమకారం చిన్ననాటి నుంచే పెంపొందాలని, అందుకే తాము(శ్రీనివాస రామానుజన్) నిర్వహిస్తున్న విద్యాసంస్థల్లో తెలుగు భాషకు ప్రత్యేక ప్రాధాన్యం కల్పిస్తూ విద్యార్థుల్లో భాషా విలువలను పెంపొందించే కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని డాక్టర్ ముచ్చ రాజిరెడ్డి తెలిపారు. గిడుగు వెంకట రామమూర్తి ఆశయాలకు అనుగుణంగా తెలుగు భాషను దైనందిన జీవితంలో మరింతగా వినియోగించడం ద్వారానే ఆయనకు నిజమైన నివాళి అర్పించినవారమవుతామని అన్నారు. తెలుగు భాషను ఆధునిక సాంకేతికతతో అనుసంధానం చేస్తూ భావితరాలకు చేరవేయాల్సిన అవసరం ఉందన్నారు. గిడుగు వెంకట రామమూర్తి ఆశయాలు నేటి సమాజానికి కూడా మార్గదర్శకాలని, ఆయన చూపిన బాటలో నడవడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అవుతుందని అన్నారు. తెలుగు భాషా దినోత్సవం ప్రతి ఒక్కరిలో మాతృభాష పట్ల గౌరవం, బాధ్యత, ఆత్మీయతను మరింత పెంపొందించాలని ఆకాంక్షించిన డాక్టర్ ముచ్చ రాజిరెడ్డి, తెలుగు భాషను సంరక్షించడం, అభివృద్ధి చేయడం ప్రతి తెలుగువాడి సామాజిక బాధ్యత అని పిలుపునిచ్చారు. గిడుగు వెంకట రామమూర్తి సేవలు తెలుగు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని, ఆయన స్ఫూర్తి భావితరాలకు దిక్సూచిగా నిలుస్తుందని పేర్కొన్నారు.

## మానసిక దివ్యాంగ చిన్నారులతో ఆప్యాయంగా రాఖీ వేడుకలు



▪ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరికి రాఖీలు కట్టిన చిన్నారులు -- ప్రేమ, ఆప్యాయతలే నిజమైన పండుగల స్ఫూర్తి అని వ్యాఖ్య





**కరపత్రం ప్రతినిది బ్యూరో, ఆగస్టు 28**

సోదర--సోదరీమణుల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి వేడుకలను వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హృద్యమైన వాతావరణంలో మానసిక దివ్యాంగ చిన్నారులతో కలిసి జరుపుకున్నారు. హన్మకొండ కనకదుర్గ కాలనీలోని తమ నివాసంలో నిర్వహించిన ఈ వేడుకల్లో మల్లికాంబ మనోవికాస కేంద్రానికి చెందిన చిన్నారులు పాల్గొని ఎంపీ, ఎమ్మెల్యేలకు రాఖీలు కట్టి తమ ప్రేమాభిమానాలను చాటుకున్నారు.

చిన్నారులు ఆప్యాయంగా రాఖీలు కట్టడంతో ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి భావోద్వేగానికి లోనయ్యారు. అనంతరం వారు స్వయంగా చిన్నారులకు మిఠాయిలు తినిపించి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారులతో కాసేపు ముచ్చటిస్తూ వారి ఆరోగ్యం, చదువు, అభివృద్ధి గురించి ఆరా తీశారు. చిన్నారుల అమాయకత్వం, ఆప్యాయత వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. పండుగలను కేవలం కుటుంబ సభ్యులతో మాత్రమే కాకుండా సమాజంలో ప్రత్యేక శ్రద్ధ, ప్రేమ అవసరమైన దివ్యాంగ చిన్నారులతో కలిసి జరుపుకోవడం ద్వారా నిజమైన ఆనందం, సంతృప్తి లభిస్తుందని పేర్కొన్నారు. మానసిక దివ్యాంగ పిల్లలకు సమాజం ప్రేమాభిమానాలు, ప్రోత్సాహం అందిస్తే వారు కూడా ఆత్మవిశ్వాసంతో జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశాలు మరింత మెరుగుపడతాయని అన్నారు. దివ్యాంగ చిన్నారులను ప్రేమతో ఆదరిస్తూ, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్న మల్లికాంబ మనోవికాస కేంద్రం నిర్వాహకులు, ఉపాధ్యాయుల సేవలను వారు అభినందించారు. దివ్యాంగ పిల్లల సంక్షేమంతో పాటు కేంద్రం అభివృద్ధికి తమవంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మల్లికాంబ మనోవికాస కేంద్రం నిర్వాహకులు, ప్రతినిధులు, ఉపాధ్యాయులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు. రాఖీ పండుగను మానవీయ విలువలకు ప్రతీకగా నిలిపిన ఈ వేడుక అందరినీ ఆకట్టుకుంది.

## హనుమకొండ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శిగా నేరెళ్ల వెంకట హైమ పూజిత బాధ్యతల స్వీకారం

▪ ఉచిత న్యాయ సహాయం ప్రతి అర్హుడికి చేరేలా కృషి చేస్తాం – కార్యదర్శి నేరెళ్ల వెంకట హైమ పూజిత

**కరపత్రం ప్రతినిది హనుమకొండ, ఆగస్టు 28**



హనుమకొండ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) నూతన కార్యదర్శిగా నేరెళ్ల వెంకట హైమ పూజిత శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. భద్రాద్రి కొత్తగూడెం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వహిస్తున్న ఆమె, పదోన్నతిపై హనుమకొండ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శిగా బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి జి. రామలింగం, సంస్థ అధికారులు, సిబ్బంది నూతన కార్యదర్శికి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నేరెళ్ల వెంకట హైమ పూజిత మాట్లాడుతూ.. సమాజంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉచిత న్యాయ సహాయం సకాలంలో అందేలా సమర్థవంతమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజల్లో న్యాయ సేవలపై అవగాహన పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, లోక్‌అదాలత్‌లు, న్యాయ విజ్ఞాన శిబిరాలు, న్యాయ అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా, ఫలితాలిచ్చే విధంగా నిర్వహించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అమలవుతున్న వివిధ న్యాయ సేవా కార్యక్రమాలు గ్రామీణ ప్రాంతాలతో పాటు సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు మరింత చేరువయ్యేలా అధికారులు, సిబ్బంది, ప్యానెల్ న్యాయవాదులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆమె సూచించారు.

న్యాయ సేవలను ప్రజలకు సులభంగా అందించడమే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రధాన లక్ష్యమని, ఆ దిశగా అందరి సహకారంతో సంస్థ పనితీరును మరింత మెరుగుపరుస్తామని నేరెళ్ల వెంకట హైమ పూజిత స్పష్టం చేశారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాఖీ కట్టిన మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ

▪ మహిళల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం.. మహిళా సాధికారతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని వ్యాఖ్య

**కరపత్రం ప్రతినిది హైదరాబాద్, ఆగస్టు 28**



రాఖీ పౌర్ణమి సందర్భంగా తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ శుక్రవారం హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి రాఖీ కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన ఆయురారోగ్యాలతో ఉండి రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ, అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగ భారతీయ సంస్కృతిలో విశిష్ట స్థానం కలిగిన పర్వదినమని పేర్కొన్నారు. మహిళలకు రక్షణ, గౌరవం, భద్రత కల్పించాలనే సందేశాన్ని ఈ పండుగ సమాజానికి అందిస్తుందని అన్నారు.

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఆమె పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు, ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే దిశగా చర్యలు తీసుకుంటోందని వివరించారు. అలాగే అమ్మ ఆరోగ్యం కార్యక్రమం ద్వారా మహిళలకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తూ వారి ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని తెలిపారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ ఆడబిడ్డలకు అన్నగా నిలిచి, మహిళల సంక్షేమం, భద్రత, సాధికారత కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని ఎర్రబెల్లి స్వర్ణ కొనియాడారు. మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు రాష్ట్రాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాఖీ కట్టి, ఆయనకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేసిన ఎర్రబెల్లి స్వర్ణ, ఆయన దీర్ఘాయుష్షుతో ప్రజలకు మరింత సేవలందించాలని ఆకాంక్షించారు.